



పరశురాముడిగా..



రాక్షసు వధ చేస్తున్నట్టుగా చిన్నారుల ప్రదర్శన

చిన్నారుల క్రియోత్సాహం!



ఎంట్రీ వద్ద పేర్లు నమోదు

చిన్నారులా మజాకానా.. అలరించారు.. ఆకట్టుకున్నారు.. చూపరులకు కనువిందు చేశారు.. ఎవరికి వారు ఉత్సాహంగా ఉల్లాసంగా కనిపించారు.. ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులు పోటీపడ్డారు. తమకు అప్పగించిన టాస్క్‌ను పూర్తి చేశారు.. శెహబాష్ అనిపించుకున్నారు.. కాకినాడ జేఎన్‌టీయూకేలో శనివారం జరిగిన 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగ ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది.. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 8,500 మంది విద్యార్థులు హాజరై సందడి చేశారు. - వివరాలు 6లో



భేతాళుడి గెటప్



శ్రీకృష్ణుడి చుట్టూ గోపికల వేషధారణల్లో సాంస్కృతిక ప్రదర్శన



రివ్యూ ఆంధ్రజ్యోతి Review 2024

సాగు..బాగు!

మరో 48 గంటల్లో 2024 చరిత్రలో కలిసిపోతోంది.. మళ్లీ కొత్త ఏడాదిలో కొంగొత్తగా అడుగుపెట్టబోతున్నాం.. మరి 2024 మిగిల్చిన జ్ఞాపకాలేంటి.. విషాదాలేంటి అని ఒకసారి చూస్తే.. వైసీపీ ఉన్నంత వరకూ ఒక లెక్క.. కూటమి వచ్చిన తరువాత మరో లెక్క అనేలా ఉంది పరిస్థితి.. తూర్పు వ్యవసాయాధారిత జిల్లా.. ఇక్కడ ఆనందమైనా.. బాధయినా పంటతోనే ముడిపడి ఉంటుంది.. ఎందుకంటే జిల్లాలో వరి సాగు విస్తీర్ణమే అధికం.. ఆ సాగు బాగుగా ఉంటే ఆనందమే.. అయితే ఆరంభంలో మాత్రం వైసీపీ రైతులకు చుక్కలు చూపించింది. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో బకాయిలు చెల్లించి అన్నదాతను ఆదుకుంది.. ఖరీఫ్ సీజన్‌లో అయితే 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు చెల్లించి శెహభాష్ అనిపించుకుంది.. కోనసీమ అంటే గుర్తొచ్చేది కొబ్బరి పంట.. ఈ ఏడాది కొబ్బరి కాయ రూ.18లు పలికి రికార్డు సృష్టించింది.. ఇక ఖోఖో అయితే వెయ్యి దాటేసింది.. పొగాకు బంగారంగా మారిపోయింది.. నిమ్మకాయ సీజన్‌తో సంబంధం లేకుండా ధర నిలకడగా ఉండిపోయింది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది రైతులకు కలిసొచ్చింది..
- (అమలాపురం/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

- అన్నదాతకు కలిసొచ్చిన కాలం
- కూటమి రాకతో తీరిన వర్రీ
- ఉద్యాన పంటల ధరల రికార్డు
- అడపాదడపా తుఫాన్‌లు
- ముంచెత్తిన ఏలేరు

ఈ ఏడాది వ్యవసాయం ఉగాది పచ్చడిలా ఉంది..అంతగా నష్టాలు లేవు.. అలాగని లాభాలు లేవు.. కాస్త తీపి.. కాస్త చేదు.. కాస్త కారం.. ఇలా షడ్రుచులు కనిపించాయి.సాగు బాగుందా అంటే బాగుంది అంతే. గతేడాదికంటే కాస్త బెటర్ అని ఖచ్చి తంగా చెప్పవచ్చు.ఎందుకంటే ఈ ఏడాది వరి వర్రీ తీరి పోయింది..ప్రభుత్వం మారిందో లేదో.. అలా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన 48 గంటల్లోనే సొమ్ములు జమయ్యాయి..రబీ సీజన్ డబ్బులైతే ఇంకా పడ్డా యో లేవో కూడా తెలియదు.ఎందుకంటే ఆ సీజన్ జగన్ ప్రభుత్వంలో అన్నదాతలు పంట డబ్బులకు అష్టకష్టాలు పడ్డారు.ఇక నిమ్మ,కొబ్బరి, పొగాకు, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలైతే దిగుబడి తగ్గడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో రైతు కాస్త ఊపిరి పీల్చుకున్నాడు.

2.42 లక్షల హెక్టార్లలో సాగు..

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడినా రైతులు గట్టెక్కారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగువిస్తీర్ణం 2.42 లక్షల హెక్టార్లు ఉంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం విధించిన సవాలక్ష నిబంధనల మధ్య ధాన్యం విక్రయాలు చేపట్టినా రైతులకు ధాన్యం బకాయిలను సకాలంలో చెల్లించలేదు. దీంతో రైతులు ఉద్యమ బాట పట్టారు.మేలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో వైసీపీ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను సైతం ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో చెల్లించి ఆదుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ధాన్యాన్ని సివిల్ సప్లయిస్‌కు విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బులు జమ కావడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. ధాన్యానికి క్వింటాకు రూ.117 మద్దతు ధర కేంద్రం పెంచింది.

కొబ్బరి ధర రికార్డు

ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండడంతో కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.ఈ ఏడాది ప్రారంభంలో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.8 వేలు ఉంది. మార్చి నెలలో కోనసీమ ప్రాంతం అంబాజీపేటలో నాఫెడ్ కేంద్రాన్ని ప్రారంభించడంతో కొబ్బరి మార్కెట్ పుంజుకుంది. అప్పటి నుంచి పచ్చికొబ్బరికాయ రూ.10 నుంచి రూ.18 వరకూ గరిష్ఠంగా పెరిగింది. కార్తీకమాసం తరువాత కొబ్బరి కాయ రూ.12లకు పడిపోయింది. గత రెండు రోజుల నుంచి పచ్చికొబ్బరికాయల ధర రూ.15ల వద్ద కొనసాగుతుంది.2025 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించింది.

ముంచెత్తిన..ఏలేరు

ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను వదల్లేదు. వరదలు, భారీ వర్షాలు, తుఫాన్ల వంటి విపత్తుల వల్ల పంటలను నష్టపోయారు. వరితో పాటు వివిధ రకాల ఉద్యాన, మెట్ట పంటలకు నష్టం వాటిల్లింది. సెప్టెంబరులో సంభవించిన ఏలేరు అకాల వరద వల్ల కాకినాడ జిల్లాలో 14 మండలాల్లో 14,425 హెక్టార్లలో రూ.36 కోట్లు విలువైన పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు 26 వేల మంది రైతులకు నష్టం సంభవించింది. అక్టోబరులో అకాల వర్షాలతో కాకినాడ జిల్లాలో 110 హెక్టార్లు, డిసెంబరులో వచ్చిన ఫెంగల్ తుఫాన్ వల్ల 65 హెకార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. కోనసీమ జిల్లాలో 538 హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడింది. 1926 హెక్టార్లలో ఉద్యానపంటలకు నష్టం కలిగింది. ఆగస్టులో సంభవించిన గోదావరి వరదల వల్ల కోనసీమ జిల్లాకు నష్టం కలిగింది.తూర్పుగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.



పెద్దాపురంలో ఏలేరు కాలువ ఉధృతి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

నిమ్మ పంట పండింది!



దేవరపల్లి/రాజానగరం : నిమ్మకాయలు ధరలు ఈ ఏడాది ఆరం భం నుంచి తగ్గే దేలే అన్నట్టు రైతులకు కాసులు కురిపిం చాయి. జనవరి నుంచి ఫిబ్రవరి వరకు కిలో ధర రూ.24 నుంచి రూ.45లకు ఎగబాకింది.మార్చి, ఏప్రిల్,మేలో కిలో రూ.55 - రూ.60 వరకు పెరు గు తూ వచ్చింది. జూన్, జూలై కిలో రూ.20 - రూ.35 వరకు కొంత వరకు తగ్గింది. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు రూ.30 - రూ.45 వరకు ధర నిలకడగా ఉంది. వర్షాకాలంలో అధిక వర్షపాతం వల్ల దిగుబడి తగ్గింది.ఈ ఏడాది సీజన్ అన్ సీజన్ అనే తేడా లేకుండా అన్ని రోజుల్లోనూ ధర పలికింది.



కోకో.. పరుగే..పరుగు

పెరవలి/సామర్లకోట : ఈ ఏడాది కోకో గింజల ధర కేక పెట్టింది.గతంలో ఎన్నడూ లేని విధంగా క్రమ క్రమంగా రేటు పెరుగుతూ ఒక వెయ్యి 50 రూపాయలు గింజల రేటు పెరగడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గతే డాది కేజీ గింజల ధర రూ.240 మాత్రమే పలికింది. సుమారు పదేళ్ల కిందట కేజీ గింజల ధర వంద రూపాయల్లోపు మాత్రమే ఉండేది. ఆ రేటు క్రమ క్రమంగా పెరుగుతూ గతేడాది అధిక ధర రూ.240 పలికింది.ఈ సంవత్సరం రూ.300 నుంచి రూ.800ల వరకూ అత్యధిక ధర రూ.1050 పలకడంలో ఎక్కువ మంది రైతుల కోకో వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 58 వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతుంది. పామాయిల్ టన్నుకు రూ.20,245 చొప్పున ధర చెల్లిస్తుండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జీడిపప్పు అధరహో

నల్లజర్ల : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో జీడిమామిడి సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఉంది.జీడిమామిడి దిగుబడి తగ్గి డిమాండ్ ఎక్కువ ఉండడంతో ధరలు పెరిగాయి.రైతుల వద్ద నుంచి జీడిగింజల సేకరణ పూర్తయ్యాక జీడిపప్పు రేటు పెరగడం కొసమెరుపు.జీడిపప్పు ధర మార్చి నెలలో కిలో రూ.550 ఉండగా అక్టోబరు నెలలో ఏకంగా కిలో రూ.800 చేరింది. నవంబరు నెలలో కిలో రూ20 తగ్గి ప్రస్తుతం కిలో రూ.780 వద్ద స్థిరపడింది. జిల్లాలో సాగు విస్తీర్ణం ఉన్నా ధరలు మాత్రం ఆకాశం వైపే చూస్తున్నాయి.

పామాయిల్ సాగులో అనూహ్యం

సామర్లకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 58వేల ఎకరాల్లో సాగులోఉన్న పామాయిల్ ఈఏడాది అనూహ్య ఫలితాలు అందుకుంది. పంట దిగుబడుల విస్తీర్ణం 40వేల ఎకరాలకు పైబడి ఉంది. పామాయిల్ గెలలకు పామాయిల్ క్రషింగ్ మిల్లులు టన్నుకు రూ.20,245 చొప్పున రైతులకు ధర చెల్లిస్తుండడంతో ఈ ఏడాది సాగుకు అత్యధిక రైతులు ఆసక్తి కనబర్చారు. మెట్టప్రాంతాల్లో మాత్రమే సాగులో ఉన్న కర్రపెండలం దుంప సాగు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒకప్పుడు 60వేల ఎకరాల వరకూ ఉండగా ఇప్పుడు 8వేల ఎకరాలకు దిగజారింది. ఈ ఏడాది పుట్టికి (225కిలోలు) రూ.1,500 వరకూ మాత్రమే ధర చెల్లిస్తారని మిల్లుల వర్గాల ద్వారా తెలుస్తోంది.

వచ్చే నెల 4న బయలుదేరనున్న

స్టెల్లా నౌక



- రేషన్‌బియ్యం నిల్వల ఆరోపణలతో కాకినాడ యాంకరేజ్ పోర్టులో నిలిచిన నౌక
- ప్రస్తుతం రేషన్‌బియ్యాన్ని దింపేస్తున్న అధికారులు
- ఎగుమతికి సిద్ధంగా ఉన్న 19,785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎక్కించాక నౌక ప్రయాణం మొదలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టెల్లా ఎల్‌నౌక జనవరి 4న బయలుదేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ నౌకలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనిఖీలతో అధికారులు ఇటీవల నౌకలో బియ్యాన్ని పరిశీలించారు. ల్యాబ్‌కు సైతం నమూనాలు పంపి రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం ఇప్పటివరకు 555 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని తొలి బార్జిలోకి దించేశారు. మిగిలిన 765 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని రెండో బార్జిలోకి అన్‌లోడింగ్ చేస్తున్నారు. ఈ రెండు బార్జిలు ఆదివారం ఉదయానికి యాంకరేజ్ పోర్టుకు చేరుకుంటాయి. అనంతరం ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న 19,785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్టెల్లాఎల్ నౌకలోకి ఎక్కిస్తారు. ఈ మొత్తం లోడింగ్‌కు వారం రోజులు సమయం పడుతుంది. ఈ భారీ నౌక జనవరి 4న బయలు దేరే అవకాశాలున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ నౌక పశ్చిమ ఆఫ్రికాలో బెనిన్ దేశంలోని కొటోనా పోర్టుకు ప్రయాణించేందుకు 26రోజుల సమయం పడుతుంది.

46రోజులు కాకినాడ తీరంలోనే..

ఈభారీ నౌక 46 రోజులపాటు కాకినాడ సముద్ర తీరంలోనే లంగరు వేసి ఉండిపోయింది. దీనివల్ల డెమరేజీ చార్జీలు కూడా భారీగానే ఎగుమతిదారులపై పడింది. ఈ ఏడాది నవంబరు 11న కాకినాడ తీరానికి స్టెల్లా ఎల్‌నౌక వచ్చింది. నౌకలో రేషన్‌బియ్యం ఉన్నాయనే ఆరోపణలతో నిలిపివేశారు. గతంలో ఎప్పుడూ ఒక భారీనౌక ఇన్ని రోజులు కాకినాడ సముద్ర తీరంలో ఉన్న దాఖలాలు లేవని అధికారులు చెబుతున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టుతోపాటు కాకినాడ సీపోర్టులో ఉన్న మొత్తం మూడు చెక్‌పోస్టులవద్ద రేషన్‌బియ్యం తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

హస్తకళ ప్రదర్శనను సందర్శించిన జేసీ



కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిపాలనా యంత్రాంగం, నాబార్డు, సెర్ప్ సంయుక్తంగా కాకినాడప్రభుత్వ ఐటీఐ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్వయం సహాయక సంఘాల మహిళల రూపొందించిన చేనేత వస్త్రాలు, హస్తకళ వస్తువుల ప్రదర్శనను జేసీ రాహుల్‌మీనా, ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ శనివారం సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలనుంచి ఏర్పాటు చేసిన 100 స్టాల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఇన్‌చార్జి పీడీ శ్రీరమణి, నాబార్డు జీఎం సోమునాయుడు, డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ జిలాని పాల్గొన్నారు.

బకాయిదారులపై చర్యలు చేపట్టండి

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు వివిధ రూపాల్లో చెల్లించాల్సిన పన్ను బకాయిదారులపై తక్షణమే చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ శాఖాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగర అభివృద్ధికి దోహదపడే పన్నుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని సూచించారు. పన్నుల వసూళ్లపై శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఇంటిపన్నుకు సంబంధించి 11వేల రెసిడెన్షియల్ హౌసెస్, 6వేల నాన్‌రెసిడెన్షియల్ హౌసెస్‌కు సంబంధించిన ఇంటి పన్నుల వసూలుపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, రెవెన్యూ అధికారి శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని దుకాణాల సీజ్

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పన్నులు చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్నవారిపై నగరపాలక అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఆస్తి, ఇంటి పన్ను బకాయిదారులకు నోటీసులు కూడా అందజేశారు. వాటికి కూడా స్పందించని వారిపై చర్యలు చేపడుతున్నారు. ఇంటి, కుళాయి కనెక్షన్ల తొలగింపుతో పాటు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు లోని షాపులకు అద్దె చెల్లించని వాటిని సీజ్ చేస్తున్నారు. ఇప్పటికే కాకినాడ నగరంలోని పలు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని దుకాణదారులకు పన్ను నోటీసులు ఇవ్వడంతో పాటు మొండిబకాయిదారుల షాపులను సీజ్ చేస్తున్నారు.

రేపు ఏపీఎస్పీ హైస్కూల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లకు శిక్షణ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న కాకినాడ రూరల్ ఏపీఎస్పీ హైస్కూల్లో జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి శిక్షణా తరగతులు డిసెంబరు 31 నుంచి 2025, జనవరి 2 లోపు నిర్వహించాలని, పాఠశాల స్థాయిలో జనవరి 3 నుంచి 6 వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ఎంఈవోలను ఆదేశించారు. నూరుశాతం సభ్యులు హాజరయ్యేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశాలకు చెందిన తీర్మానాలు, ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు.

రేపటి సైనికుల కోసం..

సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



పరీక్ష కేంద్రాలు

దేశ వ్యాప్తంగా 190 కేంద్రాల్లో ఆయా రాష్ట్రాల వారీగా పరీక్ష రాసే అవకాశం కల్పించారు.
ఆంధ్రప్రదేశ్: విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం..

ఆంధ్రజ్యోతి/తుని రూరల్:

మీ పిల్లలు.. రేపటి దేశ రక్షకులు కావాలనుకుంటున్నారా..? అయితే దేశభక్తిని చాటుకునేందుకు మీకు ఇది చక్కటి అవకాశం. సైన్యంలో చేరికకు పటిష్ట పునాది లాంటిది కూడా.. దేశవ్యాప్తంగా సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. దీనికి గాను ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దీనికి వచ్చేనెల 13వతేదీ దరఖాస్తుకు తుది గడువుగా ఉంది. ఇంకెందుకు ఆలస్యం.. ఇందులో చేరికకు అర్హతలు.. అవకాశాల గురించి తెలుసుకుందాం..

- దేశభక్తిని చాటుకునేందుకు చక్కటి అవకాశం
- సైన్యంలో చేరికకు పటిష్ట పునాది
- ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం
- వచ్చేనెల 13వతేదీ దరఖాస్తుకు తుది గడువు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష

దేశభక్తిని చాటుకోవాలనే విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కటి అవకాశం కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 2025-26 ఏడాదిలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. దేశరక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారు. వీటికి సంబంధించిన ప్రవేశ పరీక్షలను ప్రస్తుతం ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తోంది. సైనిక్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి బాలబాలికలు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందడానికి బాలురు మాత్రమే అర్హులు. ఇందులో సీటు పొందడానికి ఎన్‌టీఏ నిర్వహించే ప్రవేశ పరీక్ష, వైద్యపరీక్షల్లో అర్హత సాధించాలి. ఇక్కడ ఇంటర్మీడియట్ వరకు విద్యను కొనసాగించొచ్చు.

రిజర్వేషన్లు

ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం, రక్షణ శాఖలో పనిచేస్తున్న వారు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఆరో తరగతిలో 80 సీట్లు, తొమ్మిదో తరగతిలో 20 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జనన, కుల, నివాస, ధ్రువపత్రాలతోపాటు సైనిక ఉద్యోగుల పిల్లలకు సర్వీసు ధ్రువపత్రం, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు పీపీఓను అప్‌లోడ్ చేయాలి.

అర్హతలు

సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు 10 నుంచి 12ఏళ్ల(2013, ఏప్రిల్ 1 నుంచి 2015, మార్చి 31) మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 13నుంచి 15ఏళ్ల వయస్సు కలిగి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ(2010, ఏప్రిల్ 1 నుంచి 2012, మార్చి 31) లోపు జన్మించి ఉండాలి.

పరీక్షా విధానం

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించే ప్రవేశ పరీక్ష పూర్తిగా రాత విధానం(ఓఎంఆర్ సీట్స్)లో ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 3గంటల పరీక్ష సమయం. ఆరో తరగతి పరీక్ష గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో, తొమ్మిదో తరగతికి ఆంగ్లంలో ఉంటుంది.

సౌకర్యాలు..

సైనిక్ పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు ఆరునుంచి ఇంటర్ వరకు విద్య, వసతితోపాటు, ఎన్‌సీసీ, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఈత, గుర్రపు స్వారీ తదితర సహ పాఠ్య కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు. మొదటి ఏడాది రూ.1.10 లక్షల ఫీజుగా చెల్లించాలి. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50శాతం విద్యార్థులకు రక్షణశాఖ నుంచి రూ.53వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొందొచ్చు. సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష(ఎన్‌డీఏ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే పుణేలో రెండేళ్ల శిక్షణ ఇస్తారు. ప్రతిభ ఆధారంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో అధికారులుగా నియమిస్తారు.





మనకి కోరుకొండ సైనిక్ స్కూల్

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో మొత్తం 33 సైనిక్ పాఠశాలలు ఉండగా ఏపీ, తెలంగాణలకు కలిపి మన రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో కోరుకొండ సైనిక్ స్కూల్ ఉంది. దాని వెబ్‌సైట్ www.sainikschoolkorukonda.org లో అక్కడి శిక్షణకు సంబంధించి పూర్తి వివరాలు లభ్యమవుతాయి.

దరఖాస్తు చేయండిలా..

www.aissee.nta.nic.in వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువపత్రాలను, విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీలు రూ.650 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. దరఖాస్తులు ఈనెల 24నుంచి స్వీకరిస్తుండగా వచ్చేనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల వరకు చేసుకునే అవకాశం కల్పించారు. జనవరి 14వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఫీజు కట్టేందుకు గడువు ఇచ్చారు. నమోదు చేసుకున్న ఫోన్ నెంబరుకు సంక్షిప్త సందేశాన్ని పంపిస్తారు. ఆన్‌లైన్‌లో పంపిన విద్యార్థుల దరఖాస్తును ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి. పరీక్ష ఎప్పుడు నిర్వహించేది ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) త్వరలో ప్రకటిస్తుంది.

సిలబస్ ఆరో తరగతి

300 మార్కులకు పరీక్ష ఉంటుంది. గణితం 150 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 50 మార్కులకు, భాషా సామర్థ్యం 50 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్ 50 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు(2.30 గంటలు) అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40 శాతం మార్కులు రావాలి.

సిలబస్ తొమ్మిదో తరగతి

400 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీనిలో గణితం 200 మార్కులకు, సామాన్యశాస్త్రం 50 మార్కులు, ఆంగ్లంలో 50 మార్కులకు, సాంఘికశాస్త్రం 50, ఇంటెలిజెన్స్ 50 మార్కులకు సంబంధించి ఉంటుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు(3గంటలు). అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40 శాతం మార్కులు రావాలి. రాత పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1:3 నిష్పత్తిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.


ఘటోత్కచుడి వేషధారణలో..


శక్తి వేషధారణలో రాక్షస సంహారం చేస్తున్న అమ్మవారిగా..


సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు


భరతమాత.. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో..


వేంకటేశ్వరస్వామి వేషంలో..

ఉత్సాహభరితంగా 'క్రియ'

- జేఎన్‌టీయూకేలో 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగ
- ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారుల పండగ
- వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- ఏపీ, తెలంగాణా నుంచి తరలివచ్చిన 8,500 విద్యార్థులు
- ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న జేపీ తదితరులు

సర్పవరంజంక్షన్,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వారంతా భావి భారతపౌరులు. తరగతిగదిలో గడిపే విద్యార్థులంతా ఉత్సాహంగా.. సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, వేషాలు, నాటిక, నాటక పోటీల్లో తమ ప్రతిభను కనబర్చారు. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రియ సంస్థ నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు కాకినాడ జేఎన్‌టీయూలో శనివారం ప్రారంభమయ్యాయి.

తొలిరోజు 15 అంశాల్లో..

ఉదయం 7గంటల నుంచి క్రియపిల్లల పండుగ ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న 5నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహభరితంగా పలు అంశాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తొలిరోజునాటికలు, శాస్త్రీయ నృత్యాలు, ఏక పాత్రాభినయం, డిబేట్, మ్యాప్, సైన్స్ ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వ్యాసరచన, స్టోరీ విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ, ప్రాజెక్టులు, క్విజ్, విచిత్ర వేషధారణ, పాటలు తదితర 15అంశాల్లో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక,శాస్త్రీయ నృత్యప్రదర్శనలు అలరించాయి.

ప్రతిభను వెలికితీసేందుకు దోహదం

విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న కళలను వెలికితీసేలా క్రియ సంస్థ ఒక మహోద్యమంలా ఏటా చిన్నారుల పండుగ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. క్రియ సాంస్కృతిక పోటీలు, క్విజ్ డిబేట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. క్రియ సొసైటీ చిత్తశుద్ధితో విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, తద్వారా భవిష్యత్తులో నచ్చిన రంగంలో రాణించేందుకు బంగారు బాటలు వేస్తోందని కితాబిచ్చారు. భావిభారత పౌరుల పిల్లల పండుగకు జేఎన్‌టీయూ వేదిక కావడం ఆనందంగా ఉందని, నేటిపిల్లలే రేపటి శాస్త్రవేత్తలు అని ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేసిన విద్యార్థులకు క్రియా సంస్థ సభ్యులు 100మంది, 150 మంది జేఎన్‌టీయూకేకి చెందిన బీటెక్, ఎంబీఏ విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు యుక్తవయసులో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. సత్యస్కాన్ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్రియ సొసైటీ అధ్యక్ష, సెక్రటరీలు పి.శ్రీనివాస్, ఎస్ఎస్ఆర్ జగన్నాథ రావు, ఆర్గనైజర్ జగన్నాథరాజు, యు.మాచిరాజు, డాక్టర్ ప్రవీణ్, జగన్నాథరం పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 8,500మంది అత్యంత ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

మేప్(జూనియర్స్)విభాగంలో విజేత: ఎస్.హేమంత్ రాజ్(సర్పవరం హైస్కూల్, కాకినాడ జిల్లా)
మేప్(సీనియర్స్) విజేత: వి.సూర్యకీర్తి(8వతరగతి)(విద్యాంజలి స్కూల్, కాకినాడ జిల్లా)
గ్రూప్ సాంగ్(జూనియర్స్) విజేత: విజ్ఞాన్ విహార్ హైస్కూల్(మంగళగిరి, ఎన్టీఆర్ జిల్లా)
సీనియర్స్ విజేత: ఎస్‌బీఎంఆర్ ప్రభుత్వ హైస్కూల్(పిఠాపురం, కాకినాడ జిల్లా)
డిబేట్(సీనియర్స్) విజేత: పి.చరణ్, పి.సుభాష్, ఎ.సాయితేజ, విద్యాంజలి స్కూల్(కాకినాడ జిల్లా)
కోలాటం(సీనియర్స్) విజేత: సాలిపేట బాలికల హైస్కూల్(కాకినాడ)
క్లాసికల్ డాన్స్(సీనియర్స్) విజేత: శరణ్య హైస్కూల్(వేమవరం, కాకినాడ జిల్లా)
క్లాసికల్ డాన్స్(సబ్ జూనియర్స్) విజేత: భాష్యం స్కూల్, రామచంద్రపురం(కోనసీమ జిల్లా)
క్లాసికల్ డాన్స్(జూనియర్స్) విజేత: యోగానంద హైస్కూల్(కాకినాడ)
సైన్స్‌ఎక్స్‌పెరిమెంట్స్(సీనియర్స్)విజేత: పట్టా సంజయ్‌వెంకట్, పగడాలపేటహైస్కూల్(కాకినాడ)
సైన్స్‌ఎక్స్‌పెరిమెంట్స్(జూనియర్స్)విజేత: కె.రాజసందీప్‌రాజ్, ఎల్‌వీటీహైస్కూల్, సూర్యారావుపేట(కాకినాడ)


స్వామి వివేకానందుడిగా..


ఝాన్సీలక్ష్మీభాయ్ వేషధారణ


సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకుంటూ..


శక్తి వేషధారణల్లో అమ్మవార్లుగా..


కోయదొర వేషంలో..


అల్లూరి వేషధారణలో చిన్నారి

కాకినాడలో సినీ నటుడు వెంకటేష్ సందడి

- ఓ ప్రైవేట్ చానెల్ ప్రోగ్రాంలో పాల్గొన్న 'సంక్రాంతికి వస్తున్నాం' బృందం


కార్యక్రమంలో నృత్యం చేస్తున్న వెంకటేశ్


దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకీ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రముఖ సినీనటుడు విక్టరీ వెంకటేష్ శనివారం సందడి చేశారు. 'సంక్రాంతికి వస్తున్నాం..' టీంతో కలిసి ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినీ హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, దర్శకుడు అనిల్ రావిపూడితోపాటు నటులు రాజేంద్ర ప్రసాద్, నటి గౌతమిలతో కలిసి కాకినాడ పీఆర్ కళాశాల మైదానంలో ఒక ప్రైవేటు టీవీ ఛానల్ నిర్వహించిన 'సంక్రాంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేజీపై విక్టరీ వెంకటేశ్ నృత్యం చేసి అందరినీ హుషారెత్తించారు. దీంతో పీఆర్ కళాశాల మైదానం ప్రేక్షకులతో కిక్కిరిసింది. యువత కేరింతలతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టుకు బంగారు భవిష్యత్

- మంత్రి నిమ్మల రామానాయుడు
- జగన్ ప్రభుత్వం రూ.150 కోట్లు దోచేసింది: మంత్రి సుభాష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఉప్పలగుప్తం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం టూరిజం ప్రాజెక్టుకు బంగారు భవిష్యత్ ఉందని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ కోనసీమజిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేషనల్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి శనివారం ఆయన ప్రారంభించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్.యానాం బీచ్ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రభుత్వానికి ఆదాయం, స్థానికులు ఉపాధి కల్పిస్తుందన్నారు.. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.150కోట్లు దోచేసిందని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. కూటమి పాలనలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలన్నదే తన లక్ష్యమన్నారు. సంక్రాంతి సంబరాలకు బీచ్‌ను వేదికగా చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఎస్.యానాం బీచ్ వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, సంయుక్త కార్యదర్శి అయితాబత్తుల అజయ్‌సింగ్, సభ్యుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, అరిగెల నానాజీ, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆర్డీవో కె.మాధవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బీచ్ వాలీబాల్ పోటీలు


హోరాహోరీగా తలపడుతున్న బీచ్ వాలీబాల్ జట్లు

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాంలో శనివారం నేషనల్ మహిళా ఇన్విటేషన్ బీచ్‌వాలీబాల్ పోటీలు శనివారంరాత్రి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో తొలుత గోవా, పుదుచ్చేరి జట్ల మధ్య పోరు జరిగింది. రాత్రి 9.30 గంటలకు మూడో మ్యాచ్ ఆంధ్రా, పుదుచ్చేరి జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో కామన మధుతోపాటు పలువురు పీడీలు, పీఈటీలు, నేషనల్ రిఫరీలు పోటీలను నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.42.93లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42,93598 లభించినట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, మాడవీధుల్లో పోటెత్తిన భక్తులు

పండ్ల తోటల సాగుకు నూతన యాజమాన్య పద్ధతులు

అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రం పరిశీలన

పరిశోధన ప్రగతిపై శాస్త్రవేత్తలతో సమీక్ష



కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రకాష్ పాటిల్, పలు అంశాలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కొవ్వూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఎప్పటికప్పుడు నూతన యాజమాన్య పద్ధతులు అందజేస్తున్నట్లు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ అన్నారు. శనివారం కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని ఆయన పరిశీలించి ఏడాదిగా జరుగుతున్న పరిశోధన ప్రగతిపై శాస్త్రవేత్తలతో సమీక్షించారు. పండ్లలో కొత్త రకాల ఉత్పత్తి, వేరే ప్రాంతాల్లో విడుదల చేసిన వంగడాలు ఈ ప్రాంతంలో సాగుకు అనుకూలతలు, సాగులో నూతన యాజమాన్య పద్ధతులు, అరటిని ఆశించే తెగుళ్లను ఎదుర్కోవడానికి చేస్తున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధనా ఫలితాలు ఎంతవరకు రైతులకు అందుతున్నాయో తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పండ్ల తోటలు సాగుచేసే రైతులు నష్ట పోకుండా పరిశోధనలు జరుపుతున్నామన్నారు. ఈ పరిశోధనలకు కేంద్రం నుంచి 75 శాతం, రాష్ట్రం నుంచి 25శాతం నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, కడప జిల్లా అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, కొవ్వూరు 4 కేంద్రాల్లో అరటి, పనస, సపోట, మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ జాతికి చెందిన పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. సాగులో రసాయనాలు తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులను కనుగొంటున్నామన్నారు. ప్రతి రెండేళ్లకు యూనివర్శిటీ నుంచి నూతన యాజమాన్య పద్ధతులపై ఉద్యాన పంచాంగం (డైరీ), పుస్తకాలను తయారుచేసి రైతులకు అందజేస్తున్నామన్నారు. పరిశోధనల అనంతరం పరీక్ష చేసి వచ్చిన ఫలితాలపై రైతులు సంతృప్తి చెందితే అధికసంఖ్యలో మేలైన వంగడాలను తయారుచేసి అందజేస్తున్నామన్నారు.

రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్

వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ డైరెక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పద్దిపర్రులో రైతు 3 ఎకరాల్లో అవకాడో పంట సాగు చేస్తున్నారన్నారు. డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, రాంభూటన్ పండ్లకు సంబంధించి వెంకట్రామన్నగూడెంలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. రైతులు సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటల్లో చీడపీడలతో పాటు, పండ్ల సైజు చిన్నదిగా ఉండడం, నాణ్యత వంటి అంశాలపై మూడేళ్లుగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. మరో రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్ వంగడాలను రైతులకు అందజేస్తామన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో, వాతావరణ మార్పులు కారణంగా సంభవించే సమస్యలు, ప్రస్తుతం రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై 20 కేంద్రాల్లో ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి రైతులకు సూచనలు ఇస్తున్నామన్నారు. దేశం మొత్తంలో భారతీయ సమన్వయ పరిశోధన మండలి పరిధిలో ఉష్ణ మండలం, సమ ఉష్ణ మండలంలో పండ్లతోటలపై పరిశోధనలు చేసి గ్రూపు సమావేశాల్లో శాస్త్రవేత్తలు పరిశోధనా ఫలితాలను ఒకరికొకరు షేర్ చేస్తున్నామన్నారు. కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో రైతులకు టిష్యూ కల్చర్ అరటి మొక్కలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆదివారం మారేడుమిల్లిలో క్షేత్ర సందర్శనకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు వి.శివకుమార్, ఎ.స్నేహలత, కె.రవీంద్రకుమార్ ఉన్నారు.

పగటి పూట రెక్కీ... ఇంట్లో ఎవరూ లేకపోతే చోరీ!

చోరీ కేసుల్లో నిందితుడు.. కాకినాడలో అరెస్ట్

రూ.11.16 లక్షల విలువైన ఆభరణాలు, నగదు స్వాధీనం



పట్టుబడ్డ చోరీ సొత్తును విలేకర్లకు చూపుతున్న డీఎస్పీ రామచంద్రరావ్

కాకినాడ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడుగా పగటి పూట రెక్కీ నిర్వహిస్తాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలిసిన మరుక్షణం ఆ ఇంటిని కొల్లగొట్టి ఉన్నకాడికి దోచుకుంటాడు. నిండా రెండు పదుల వయస్సు లేని ఆ యువకుడు గతేడాదిగా పోలీసులకు చిక్కకుండా యదేచ్ఛగా చోరీలు చేస్తూ చివరికి కాకినాడ పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడి నుంచి రూ.11,16,840 విలువైన 129 గ్రాముల బంగారు ఆభరణాలు, 560 గ్రాముల వెండి వస్తువులు, రూ.1,50,000 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ త్రీటౌన్ సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.రామచంద్రరావ్ నిందితుడి వివరాలు వెల్లడించారు. ఇటీవల కాకినాడ టౌన్, రూరల్ పరిసర ప్రాంతాల్లో పగటిపూట దొంగతనాలు అధికం కావడంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కరరావ్ పర్యవేక్షణలో డీఎస్పీ రామచంద్రరావ్ నేతృత్వంలో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగదుర్గారావ్‌ల బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి స్థానిక ఎస్ఆర్ఎంటీ పార్శిల్ ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడు తారసపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా కాకినాడ పర్లోపేట రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్స్‌కు చెందిన సుంకర తేజగా తెలిపాడు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ జల్సాలకు మరిగాడు. ఈ నేపథ్యంలో సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఏడాదిగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు నేరాలు, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు నేరాలు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక నేరానికి పాల్పడినట్లు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. అతడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వినయ్‌ప్రతాప్, క్రైం డిటెక్టివ్ ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావ్, ఏఎస్ఐ ధనరాజ్, హెచ్‌సీలు ప్రసాద్, వర్మ, పీసీలు ఈశ్వరరావ్, నాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నూతిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



కుమారపురంలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు

పిఠాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. గ్రామానికి చెందిన కటారి బాబ్జి(35), నాగుకు వివాహమై ఎనిమిది సంవత్సరాలు కావస్తోంది. బాబ్జి కూలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి పిల్లలు లేరు. అదే సమయంలో భార్య తరచూ పుట్టింటికి వెళ్లుతుండడంతో ఇద్దరి మధ్య వివాదాలు జరిగాయి. ఇదే రీతిలో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో బాబ్జి ఈ నెల 26వ తేదిన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2రోజులు గాలించారు. గ్రామంలోని పంటపొలాల్లో ఉన్న నూతిలో దూకి ఆత్మహత్య చేసుకోగా శనివారం పోలీసులు గుర్తించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్రగాయాలు

పిఠాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదపూడికి చెందిన అన్నదమ్ములు మేడపాటి రాజకుమార్, వసంతకుమార్ మోటార్‌సైకిల్‌పై పిఠాపురం మండలం భోగాపురంలోని బంధువులు ఇంటికి బయలుదేరారు. జల్లూరు నుంచి ఎఫ్‌కేపాలెం మీదుగా వస్తుండగా పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్‌ను కారు ఢీకొన్న దృశ్యం

మాస్టర్ ప్లాన్ ప్రకారం వెంకన్న ఆలయాభివృద్ధి

వాడపల్లిలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సందర్శన



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కమిషనర్

ఆత్రేయపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిందని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాభివృద్ధి, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టిసారించిందని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆయన దర్శించుకున్నారు. తొలుత అర్చక బృందం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాడపల్లి వెంక న్న క్షేత్రం గత 12 ఏళ్ల నుంచి దినదినాభివృద్ధి చెం దుతుందని తద్వారా భక్తుల సంఖ్య అధికంగా ఉన్న దృష్ట్యా వసతి సౌకర్యాలు ఈ క్షేత్రంలో లేకపోవడంతో మాస్టర్ ప్లాన్ ప్రకారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు, వసతి, సకాలంలో దర్శనం అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ అన్నదానం, భక్తులకు పులిహర, ప్రసాదాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామన్నారు. కంపార్ట్‌మెంట్లు, క్యూకాంప్లెక్స్‌లు స్లాట్ విధానం అమలు చేసి భక్తులకు నిర్ణీత సమయంలో దర్శనం అందించేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు క్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్‌కు వివరించారు.

భక్తుల ఆగ్రహం

శనిత్రయోదశి పర్వదినం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రముఖుల తాకిడి అధికంగా ఉండటంతో భక్తులు గంటల తరబడి క్యూలలో నిలబడి ఉండిపోయారు. రూ.200 దర్శనం టికెట్టు పొందిన భక్తులు సుమారు 5గంటలు క్యూలలో నిరీక్షించారు. వీఐపీల సిఫార్సులేఖలతో వచ్చిన భక్తులకు దర్శనాలు సులభంగా అవ్వడంతో క్యూలలో వేచి ఉన్న భక్తులు ఆలయ అధికారులపై మండిపడ్డారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనరు భక్తులతో మాట్లాడి వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లలకు త్వరగా దర్శనమయ్యేలా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాలు, బిస్కెట్లు క్యూలైన్లలో వారికి అందించాలన్నారు. ప్రతీ శనివారం దర్శనాలకు ఆలస్యం కావడంతో లఘుదర్శనం మాత్రమే నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.



ఆలయంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న భక్తులు

అస్సాగో బాధితుల అఖిలపక్ష భేటీ భగ్నం



అస్సాగో బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు బాధితుల తరలింపు

గోకవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ కంపెనీ బాధితులు, యాజమాన్యం మధ్య రోజూ ఏదొక రూపంలో వార్ కొనసాగుతూనే ఉంది. మరోపక్క పోలీసుల నుంచి కూడా బాధితులు ప్రతిఘటన ఎదుర్కోవడం తప్పడం లేదు. అస్సాగో పరిశ్రమ నుంచి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు వివరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అఖిలపక్ష సమావేశానికి బాధితులు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సమావేశ స్థలం వద్దకు చేరుకుని సమావేశ నిర్వహణకు అనుమతి లేదంటూ బాధితులతో వాదించారు. తరువాత బాధితులను కోరుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలోకి వచ్చిన సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్య చంద్రను గ్రామం నుంచి వెనక్కి పంపితేనే బాధితులను విడిచి పెడతామంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. సమాచారం అందుకున్న సూర్యచంద్ర కోరుకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాధితుల ఇబ్బందులను పోలీసులకు వివరించారు. సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని సీఐ సత్య కిషోర్, ఎస్ఐ పవన్‌కుమార్‌ను కోరారు. గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన పరిశ్రమను వదిలి బాధితులపై కేసులు నమోదు చేయడం దురదుష్టకరమన్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించినవారిలో చందాసి చినబాబు, బూలా అబ్బులు తదితరులున్నారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.

మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, ప్రజాప్రతినిధులు

కోరుకొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లయి శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శనివారం తూర్పుగోదావరి జిల్లా మధురపూడి విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం లభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రమాదాల్లో బాధితులైన జనసేన క్రియాశీలక సభ్యులకు బీమా చెక్కులు అందజేసేందుకు వచ్చిన మంత్రి నాదెండ్లకు మధురపూడి విమానాశ్రయం వద్ద పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వాగతం పలికారు. నాదెండ్లకు ఎమ్మెల్యే బత్తుల గజమాల వేసి సత్కరించారు. ధాన్యం బస్తాలతో నిండిన రెండెడ్ల బండి నమూనాను అందజేశారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బత్తుల రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, తోట పవన్‌కుమార్, జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

విజయదుర్గా పీఠాన్ని సందర్శించిన టీటీడీ ప్రధాన అర్చకుడు



విజయదుర్గాకు పూజలు చేస్తున్న టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు శనివారం సందర్శించారు. విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, హారతులు నిర్వహించి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. తిరుమల నుంచి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాలు, లడ్డూలు గాడ్‌కు అందజేసి గాడ్‌ను శ్రీవారి శేషవస్త్రంతో వేణుగోపాల దీక్షితులు సత్కరించారు. అనంతరం పీఠంలో జరుగుతున్న పవిత్రోత్సావాలను ఆయన కొద్దిసేపు తిలకించారు. విజయదుర్గా పీఠంలో తిరుపతి వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయదుర్గాదేవి, విజయ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. వైఖానస పండితులు సాయి బృందం ఆధ్వర్యంలో విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, స్వామివారికి అమ్మవార్లకు అర్చనలు, హోమం పూర్ణాముతి నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ పవిత్రోత్సవాలు విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అర్చకులు స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

సత్యదేవుని సన్నిధిలో ఐఏఎస్‌ల పూజలు

అన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారులు డాక్టర్ సిద్దార్థ, ఎస్.విజయలక్ష్మిలు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఐఏఎస్ అధికారులకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పాలూరి వీరవెంకట నమశ్శివాయ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

మందేశ్వరాలయానికి క్యూ కట్టిన భక్తులు

స్వామివారి ఆదాయం రూ.33.85లక్షలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేలాది మంది భక్తులు

కొత్తపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి సందర్భంగా శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి శేషవస్త్రం, చిత్రపటం అందించారు. వేద ఆశీర్వచనం అందించారు. స్వామివారికి ఏడేళ్లకు గాను ప్రతీ శనివారం తైలాభిషేకం నిమిత్తం రూ.1.45లక్షలు చెల్లించారు. శనివారం వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.33,85,938 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాదేశాల మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 14 పురపాలక సంఘాల పరిధిలో వివిధ రకాలైన నైపుణ్య రంగాలైన ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గీజరు, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేరు, బ్యూటీషియన్, పెయింటర్లకు ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని మెప్మా అధికారులు తెలిపారు. దీనిలో అర్హత పొందినవారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాట్ ఫారం ద్వారా ఆన్‌బోర్డు చేసి వారికి జీవనోపాధి కల్పించడంలో భాగంగా ఈనెల 31లోగా స్థానిక పురపాలక సంఘంలో మెప్మా విభాగంలో వివరాలు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

మామిడికుదురు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారంప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాల మధ్య సుప్రభాత సేవ చేసి స్వామివారికి తొలిహారతి ఇచ్చారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,12,910 ఆదాయం వచ్చిందని.. స్వామివారిని 3518మంది భక్తులు దర్శించుకుని, 2429 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఈనెల 29వ తేదీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ ఏవీడీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3, 4, 5 తేదీల్లో జరగబోయే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బాలురు 70 కిలోల బరువు, బాలికలు 65 కిలోల బరువు ఉండాలని, ఆధార్ కార్డు, జిరాక్సు కాపీలు తీసుకురావాలని సూచించారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు, పీడీలు తమ విద్యార్థులను ఆర్ట్స్ కళాశాల గ్రౌండుకు తీసుకురావాల్సిందిగా కోరారు.



స్వామివారి దర్శనానికి క్యూలలో వేచి ఉన్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

పెద్దాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. దీంతో ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.88,440 అన్నదాన విరాళాలు రూ.60,464 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.3,880, తులాభారం, కానుకలు ద్వారా రూ.100, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,235 వెరసి రూ.1,70,119 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. 9వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీక రించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

నేడు అడవి సత్తెమ్మతల్లి సంబరాలు

కాకినాడ సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేట శివారులోని అడవి సత్తెమ్మతల్లి సంబరాలు ఆదివారం నిర్వహించేందుకు స్థానిక పెద్దలు, కమిటీ సభ్యులు సన్నాహాలు చేశారు. ఉదయం 10 గంటలకు బుడంపేట ముత్యాలవీధినుంచి అమ్మవారిని ఊరేగింపుగా పర్లోవపేటకు తీసుకువస్తారు. సాయంత్రం 6 నుంచి జాతర నిర్వహిస్తారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాదా!

ముందుకు సాగని
తుల్యభాగ డ్రెయిన్‌పై బ్రిడ్జి నిర్మాణం
పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన పనికి
ఏకంగా రూ.3కోట్ల చెల్లింపులు
పత్తాలేని గుత్తేదారుడు..నోటీసులు
ఇచ్చినా ప్రారంభం కాని పనులు


తుల్యబాగ డ్రెయిన్‌లో భూమి లెవిల్‌కు కనిపిస్తున్న శిథిల పిల్లర్లు

కరప, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరప మండలం కొంగోడు గ్రామం వద్ద తుల్యబాగ మేజర్ డ్రెయిన్‌పై రూ.5కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఈ బ్రిడ్జి నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన పనికి అధికారులు ఏకంగా రూ.3కోట్ల పైచిలుకు చెల్లించి కాంట్రాక్టర్ పట్ల తమకున్న స్వామిభక్తిని చాటుకున్నారు. అయిన కాడికి బిల్లులు చేయించుకున్న సదరు కాంట్రాక్టర్ పత్తాలేకుండా పోయాడు. సదరు కాంట్రాక్టు సంస్థకు నోటీసులు మీద నోటీసులు ఇచ్చినా నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక ఏడేళ్లుగా కొంగోడు రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. మరోపక్క డ్రెయిన్ డైవర్షన్, అప్రోచ్ రోడ్డు నిమిత్తం భూములు లీజుకిచ్చిన రైతులకు ఏళ్లు గడుస్తున్నా సదరు కాంట్రాక్టర్ లీజు సొమ్ములు చెల్లించడం లేదు.

వైసీపీ హయాంలో కొండెక్కిన నిర్మాణం

కొంగోడు రైతులు తమ పంటపొలాలకు వెళ్లేందుకు తుల్యబాగ డ్రెయిన్‌ను దాటాలి. అష్టకష్టాలు పడుతూ దోనె సహాయంతో అవతలి గట్టుకు చేరుకుని పొలం పను లు చక్కబెట్టుకునేవారు. అన్నదాతల అవస్థలను చూసి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తుల్యబాగ డ్రెయిన్‌పై ఎన్‌టీఆర్ వారధి నిర్మాణానికి రూ. 5.19కోట్ల నిధులను మంజూరుచేసింది. అప్పటి మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, అప్పటి ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్తిబాబు 2017, డిసెంబరు 30వ తేదీన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెండర్ దక్కించుకున్న ఒక కాంట్రాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యా యి. రైతుల నుంచి కొంత భూమి లీజుకు తీసుకుని డ్రెయిన్ నీరు డైవర్షన్ చేసేందుకు, వేములవాడ-గొర్రిపూడి ఏటిగట్టుపై రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్డును నిర్మించారు. వారధి నిర్మాణానికి వీలుగా డ్రెయిన్ వెంబడి పలు కాంక్రీట్ పిల్లర్లను భూమి లెవిల్‌కు వేశారు. ఈలోగా ఎన్నికలు వచ్చి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంగోడు బ్రిడ్జి నిర్మాణం కొండెక్కింది. నిర్మాణంలో వినియోగిస్తున్న యంత్రపరికరాలు, భారీస్థాయిలో మెటీరియల్‌ను కాంట్రాక్టర్ పని ప్రదేశంలోనే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఏళ్లతరబడిగా వాటిని అలాగే వదిలేయడంతో ఎండకు, వానకు యంత్రపరికరాలు, లారీలు తుప్పుపట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి. వైసీపీ హయాంలో బ్రిడ్జికి సంబంధించి ఒక్క పని కూడా జరక్కపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. మరోపక్క జరిగిన పనికి, చేసిన బిల్లులకు ఎక్కడా పొంతన లేకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్య క్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అప్రోచ్ రోడ్డు, వాటర్ డైవర్షన్ కోసం పలువురు రైతుల నుంచి భూమి లీజుకు తీసుకున్నారు. అయితే గత ఆరేళ్లుగా వారికి లీజు చెల్లించకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులకు వారు పలు వినతులు అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో విసుగుపోయిన సదరు రైతులు అప్పట్లో అప్రోచ్ రోడ్డుకు అడ్డంగా కంచె వేసి రాకపోకలను నిలిపివేశారు. అధికారులు కల్పించుకుని రైతులతో చర్చించడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది.

బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక అవస్థలు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఏళ్లతరబడిగా కొంగోడు బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడం లేదు. దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ పొలాల్లోకి వెళ్లాలన్నా, అక్కడ నుంచి పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా గొర్రిపూడి మీదుగా అనేక వ్యయప్రయాసలకోర్చి పట్టుకెళ్లాల్సివస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. సముద్రపు ఆటుపోట్లకు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తూ అప్రోచ్ రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, పలుమార్లు పంటపొలాలు, చెరువులు ముంపుబారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా తమ కష్టాలు తీరుతాయని రైతులు, కొంగోడు గ్రామస్తులు ఆశిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం జరగక తాము పడుతున్న బాధలను ఎమ్మెల్యేకు వివరించామని, సకాలంలో బ్రిడ్జిని నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని కోరినట్టు పలువురు గ్రామస్తులు తెలిపారు.


పని ప్రదేశంలో వదిలేసిన యంత్రాలు

వైసీపీ పాలనలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీల పెంపు

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచడమే గాక వివిధ రూపాల్లో భారం మోపి ఇప్పుడు వారే ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. అధిక ధరలకు కరెంటు కొనుగోలు ద్వారా విద్యుత్‌రంగాన్ని జగన్ కోలుకోలేని దెబ్బ తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో 10సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్లు భారం మోపారని విమర్శించారు. చట్టవిరుద్ధంగా పీపీఏలు రద్దు చేయడం వల్ల తక్కువ రేటుకు వచ్చే 7వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోవడం జరిగిందని తెలిపారు. పోలవరం జలవిద్యుత్ కేంద్రాన్ని 2021నాటికి పూర్తి చేయకపోవడం వల్ల రూ. 4,737కోట్లు నష్టం జరిగిందని చెప్పారు. విద్యుత్‌సంస్థలపై రూ.49వేల కోట్ల అప్పు చేసిన జగన్‌రెడ్డి నూతనంగా ఒక విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మించలేదన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనించి వైసీపీ నేతలకు తగు రీతిలో బుద్ధి చెబుతారని వర్మ చెప్పారు.


పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

జగన్ హయాంలో విద్యుత్ రంగం సర్వనాశనం : ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌రెడ్డి హయాలో విద్యుత్‌రంగం సంక్షోభంలో కూరుకుపోయి సర్వనాశనం అయ్యిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ విద్యుత్ వనరులున్న మన రాష్ట్రంలో నేడు చార్జీలు అధికంగా ఉండడానికి కారణం ముమ్మాటికి జగన్‌రెడ్డి అవినీతి, కక్ష సాధింపు విధానాలేనన్నారు. ఐదేళ్లలోపు పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32వేలకోట్ల భారం మోపారన్నారు.

'చార్జీల పెంపు జగన్ పాపమే'

పెద్దాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు మాజీ సీఎం జగన్ పాపమే అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అన్నారు. స్థానిక విలేఖరులతో ఆయన శనివారం మాట్లాడారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి జగన్ జీర్ణించుకోలేకపోతు న్నారన్నారు. 10సార్లు విద్యుత్ చార్జీలను పెంచిన జగన్ ధర్నాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. 6నెలలు తిరగకుండానే ధర్నాలు అంటూ నాటకాలు ప్రారంభించారని ఆయన మండిపడ్డారు.

'30న వామపక్షాల ధర్నా'

కాకినాడ సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న వామపక్షాల దేశవ్యాప్త నిరసనలో భాగంగా కాకినాడ కలెక్టరేట్‌వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీల నాయకకులు పిలుపునిచ్చారు. సుందరయ్యభవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జిల్లా వామపక్షాల సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సీపీఐ ఇల్లా కార్యదర్శి కె.బోడకొండ, రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడారు. పలు సంఘాల నాయకులు కొల్లి రవి, కర్నాకుల రామలింగేశ్వరావు, దువ్వ శేషబాబ్జి, ఎం.రాజశేఖర్, పలివెల వీరబాబు పాల్గొన్నారు.

'హామీ అమలుచేయాలి'

కాకినాడ సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గీత కులాలకు గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలను కేటాయిస్తూ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని శెట్టిబలిజ జనజాగృతి సేవా సంఘం నేతలు డిమాండ్ చేశారు. రామారావుపేటలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కర్రి గోపాలకృష్ణ మాట్లాడారు.

పాదగయలో భక్తుల రద్దీ

పిఠాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి శనీశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. శనీశ్వరుడు, నవగ్రహాల ఆలయం చుట్టూ ప్రదక్షణాలు చేసి దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ఈవో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డైరీల ఆవిష్కరణ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు నిర్వహిస్తున్న కోఆపరేటివ్ సొసైటీ వారు ఇచ్చిన డైరీలను కాకినాడ డీఎం మనోహర్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్స్, యూనియన్ నాయకులు, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పళ్లంరాజు



ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శనివారం నిర్వహించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు పాల్గొని మన్మోహన్ చితికి నమస్కరించి నివాళులర్పించారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

సామర్లకోట, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మతపరంగా ఛాందస భావాలు ఉన్న సమాజంలో ఒక వినూత్నమైన విధానాన్ని ప్రవేశపెట్టిన వివేకానందుడిని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెం శ్రీరామకృష్ణా సేవాసమితిలో ఏర్పాటుచేసిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. సేవా సమితి నాయకుడు కంటిపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి వివేకానందుని బోధనల ద్వారా ఎంతో తెలుసుకోవాలన్నారు. సమాజంలో మనకున్న శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఉన్నతంగానే పరిపూర్ణత పొందాలని చెప్పారు. శ్రీరామకృష్ణా సేవాసమితి సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోరంపూడి వెంకటేశ్వరరావు, జుజ్జవరపు వెంకట్రావు, డాక్టర్ కెఎస్ఎస్. ప్రసాద్, వల్లూరి శ్రీనువాసు, గుమ్మళ్ళ రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల బహూకరణ

గొల్లప్రోలు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద శ్రీదేవి, భూదేవి సమేత కలియుగ వేంకటేశ్వరస్వామికి దాతలు వెండి పళ్లెం, ఉద్దరిణి బహూకరించారు. వూడా చలపతిరావు, అయ్యన్న, వీరభద్రల జ్ఞాపకార్థం జయవరపు మురళీకృష్ణ, సత్యకుమారి దంపతులు 500 గ్రాముల వెండితో ఈ వస్తువులు తయారు చేయించారు. శనివారం వెండి వస్తువులను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం వారు దాతలను సత్కరించారు.

రైతుల అర్జీలను పరిష్కరించాలి : జేసీ


సదస్సులో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

తాళ్లరేవు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల్లో రైతులు పెట్టుకున్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని జెసీ రాహుల్ మీనా ఆదేశించారు. శనివారం తాళ్లరేవు అంబేడ్కర్ భవనంలో పోలేకుర్రు రెవెన్యూ తాళ్లరేవు, గాడిమొగ గ్రామాలకు చెందిన రెవెన్యూ సదస్సును సర్పంచ్ వెంటపల్లి నూకరాజు అధ్యక్షతన నిర్వహించారు. రైతులు 35 మంది సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. తహశీల్దార్ పి.త్రినాదరావు, డీటీ సూరిబాబు, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీపీ రాయుడు సునీత తదితరులున్నారు.

ఆసుపత్రిలో తనిఖీలు

తాళ్లరేవు ప్రభుత్వాసుపత్రిలో జేసీ రాహుల్ మీనా తనిఖీలు చేశారు. వైద్యుల పనితీరుపై ఆరా తీసి ఆరోగ్యశ్రీ ప్రతినిధిని ప్రశ్నించారు. రోగుల వార్డులు, పరీక్షలు చేసే ల్యాబ్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఏడుగురు వైద్యులకు గాను డాక్టర్ శిరీల్ మాత్రమే విధులను నిర్వహించడంతో జేసీ చర్చించారు. రక్తపరీక్షలు చేసే మిషన్‌ను దొంగిలించుకుపోయారని మాజీసర్పంచ్ దడాల బుజ్జిబాబు ఫిర్యాదు చేశారు. వైద్యులు సక్రమంగా విధులుకు హాజరుకావడం లేదని టీడీపీ నేత జక్కల ప్రసాద్ ఫిర్యాదు చేశారు.

ఇళ్ల స్థలాలు చూపించాలని మహిళల ఆందోళన

సర్పవరంజంక్షన్, డిసెంబరు28(ఆంధ్ర జ్యోతి): ఎన్నికల ముందు ఇళ్ల పట్టాలిచ్చిన అధి కారులు, తర్వాత ఇంటి స్థలం చూపించలేదని, తక్షణమే స్థలం చూపించాలని సర్పవరం గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. భూవివాదాల పరిష్కారం కోసం శనివారం కాకినాడ రూరల్ సర్పవరంలో డిప్యూటీ తహశీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల పట్టాలతో రెవెన్యూ అధికారుల వద్ద నిరసన తెలిపారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం పట్టాలిచ్చి చేతులు దులుపుకుందని, ఇంటి స్థలం చూపించకుండా పట్టాలు ఏంచేసుకోవాలో చెప్పాలని, ఈవిషయమై అధికారులు జవాబు చెప్పాలంటూ అధికారులను నిలదీశారు. మహిళలకు అధికారులు సర్దిచెప్పడంతో శాంతించారు. అనంతరం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తుండగా స్థానిక జనసేన పార్టీ నాయకులు వచ్చి తహశీల్దార్, ఆర్డీవో లేకుండా సభ నిర్వహించడం కుదరదని వాయిదా వేయాలంటూ వాగ్వాదానికి దిగారు. నచ్చచెప్పేందుకు ప్రయత్నించినావినకపోవడంతో మధ్యాహ్నం 12 గంటలకు అర్థాంతరంగా సభ నిలిపివేసి అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. ఈనెల26న ఒకసారి, 28నమరోసారి రెవెన్యూ సదస్సులు వాయిదా పడటం గమనార్హం. స్థానిక నాయకులు వ్యవహరించిన తీరు పట్ల రెవెన్యూఅధికారులు విస్మయం వ్యక్తం చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



కొత్తపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ(బీజేపీ) కొత్తపల్లి మండల నూతన అధ్యక్షున్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్షులుగా పంపన శేషగిరి రావును ఎన్నుకున్నట్టు మండల బీజేపీ రిటర్నింగ్ అధికారి బుర్రే మురళీధరరావు చెప్పారు. బీజేపీ కొత్తపల్లి మండలశాఖ అధ్యక్షుడిగా శేషగిరికి ధ్రువీకరణ పత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకటసూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షులు బిక్కుర్తి రామేశ్వరరెడ్డి, పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాసరావు మండల అధ్యక్షుడి ఎన్నికలో పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు విజయవంతం చేయాలి


యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు తరలిరావాలని ఉపాధ్యాయులను కోరుతున్న ప్రతినిధులు

గొల్లప్రోలు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5నుంచి 8 వరకు జరిగే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంబరాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. శనివారం ఈసంబరాలపై గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. స్వర్ణోత్సవాలకు తరలిరావాలని ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈఉత్సవాలను పండుగ మాదిరిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్.సూరిబాబు, షేక్ రహ్మాన్ బీ, కుటుంబ సంక్షేమ పథకం జిల్లా కోశాధికారి సీతారామరాజు, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు, ఎంవీ సత్యనారాయణ, దాడి పద్మనాభం, చల్లా ఉమారాజ మంగతాయారు, జీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

పెద్దాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాండ్రకోట గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఏజీఎం రవీంద్ర మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, రాయితీలు, ఎరువుల యాజమాన్యం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు ఎల్.వెంకటేశ్వరరావు, మద్దిపూడి వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

సామర్లకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సామర్లకోట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా పుప్పాల గోవిందు, కిలిమి దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సామర్లకోటలోని సంపెంగతోట వద్ద బీజేపీ నాయకులు కొక్కిరిగడ్డ గంగరాజు అధ్యక్షతన బీజేపీ పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు సమక్షంలో పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ ఐకమత్యంతో మెలగాలన్నారు. సుంకవిల్లి బాపిరాజు, జగన్నాధం, రమేష్, త్రిమూర్తులు, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

'తప్పులతడకగా ఎస్సీ కులగణన సర్వే'

కరప, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎస్సీల పాలిట శాపంగా మారిందని మండల ఎస్సీ నాయకుడు సాదే వీరరాఘవులు ఆరోపించారు. కరపలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీల పూర్తి సమాచారాన్ని పొందుపరచకుండా అరకొరగా సచివాలయాల్లో ఉంచడం దారుణమన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్, పంచాయతీ వద్ద ఉన్న ఎస్సీ కాలనీల్లో మాత్రమే కులగణన జరిగిందని, నక్కావారిపేట, రామకంచిరాజు నగర్, పేపకాయలపాలెం, సీతమ్మపేటల్లో కులగణన సర్వే జరగలేదన్నారు. సచివాలయంలో పొందుపరిచినఎస్సీల జాబితాకు గ్రామంలోని వాస్తవ జనాభాకు అసలు పొంతన లేదని మండిపడ్డారు. అధికారులు విచారణ చేపట్టి అందరికీ న్యాయం జరిగేలా సమగ్ర సర్వే చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ మరింత బలోపేతం

రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజ

పెద్దాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మజ అన్నారు. పులిమేరు గ్రామంలో బూత్‌స్థాయి కమిటీ నిర్మాణ ప్రక్రియ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈకార్యక్రమం చేపట్టడం జరిగినట్లు చెప్పారు. అనంతరం బూత్ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో జగన్నాథం, నాగలక్ష్మి, సూర్యారావు, వెంకట అప్పారావు, బాబ్జీ, చిట్టిబాబు, శేషయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

పెద్దాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ పట్టణ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారిగా బిక్కిన విశ్వేశ్వరరావు, అబ్జర్వర్‌గా ముత్తా నవీన్‌కృష్ణ వ్యవహరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా బొలిశెట్టి రామ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దుర్గామోహన్‌రావు, రవికృష్ణ, అల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కరప మండల అధ్యక్షురాలిగా పద్మావతి ఎన్నిక


పద్మావతిని అభినందిస్తున్న పార్టీ నేతలు మాలకొండయ్య, తదితరులు

కరప, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ కరప మండల అధ్యక్షురాలిగా గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ మండల సంస్థాగత ఎన్నికల్లో భాగంగా శనివారం పెనుగుదురులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు బాధ్యతలు అప్పగించారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య ఎన్నికల పరిశీలకుడిగా, ఎన్నికల అధికారిగా అనపర్తి వెంకటేష్ పాల్గొని 23గ్రామాల బూత్ అధ్యక్షుల ద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఈఎన్నిక నిర్వహించినట్టు పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. తన విజయానికి సహకరించిన బీజేపీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

సామర్లకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా నెలకొన్న భూసమస్యలను పరిష్కరించి శాశ్వతహక్కు కల్పించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. హుస్సేన్‌పురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం రెవెన్యూ సదస్సు డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకంలో పేర్లు తప్పులు, వాస్తవంగా నమోదు కన్నా తక్కువ విస్తీర్ణం నమోదులు, భూసర్వే తదితర సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం మ్యూటేషన్లు, ఎఫ్ లైన్ సర్వేలకు సంబంధించి మూడు అర్జీలను స్వీకరించారు. ఈసదస్సులో కార్యాలయ సూపరింటెండెంట్ కె.పద్మజ, టీడీపీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, తలారి పోతురాజు, తలారి శ్రీను, వీఆర్వోలు జయమ్మ, ఖాదర్ వల్లీ, కనకేంద్ర, సర్వేయరు సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్ ప్రసాద్, డీఈవో శ్రీహరి తదితర రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాలకు ఆహ్వానం

ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల సర్వే నివేదికలు సామర్లకోట మండలంలోని అన్ని సచివాలయాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి ప్రదర్శించామని, వాటిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సచివాలయాల్లో ఈనెల 31వ తేదీ సాయంత్రంలోపు తెలియచేయాలని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వివరాలకు, మరింత సమాచారం కోసం వీఆర్వోలను సంప్రదించాలని కోరారు.

'ఎంపీడీవోపై దాడి దుర్మార్గం'

పెద్దాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి దుర్మార్గమైన చర్య అని పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలిత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీలలిత ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సత్యనారాయణమూర్తి, మహేష్ పాల్గొన్నారు.

సామర్లకోటలో మెప్మా మార్కెట్

సామర్లకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మెప్మా ఆధ్వర్యంలో శనివారం పెద్దాపురం రోడ్డు ఎస్‌బీఐ వద్ద మెప్మా మార్కెట్ స్టాల్‌ను ఏర్పాటుచేశారు. మెప్మా ఆధ్వర్యంలో ఉన్న ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు చెందిన మహిళలు పలు ఆహార పదార్థాలను, అల్లికల వస్తువులను, డ్రైఫ్రూట్స్ విక్రయాలకు సిద్ధం చేశారు. బహిరంగ మార్కెట్లో కన్నా తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో మెప్మా మార్కెట్ విక్రయాలు ఉంటాయని మెప్మా సీఎంఎం సయ్యద్ హుస్సేన్ చెప్పారు. కార్యక్రమంలో సీవోలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జూదాలకు దూరంగా ఉండాలి

పిఠాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సమయాల్లో కోడిపందాలు, జూదాలకు దూరంగా ఉండాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని మోహన్‌నగర్ టిడ్కో గృహాల వద్ద శనివారం రాత్రి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతిని కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుకోవాలన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నవశకానికి ఆద్యుడు మన్మోహన్'

పిఠాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశం నవశకంలో పయనించడానికి ఆద్యుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ అన్నారు. పిఠాపురం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధి, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం మన్మోహన్‌ను కలిసి మాట్లాడిన సందర్భాలను ఆమె గుర్తు చేసుకున్నారు. ఆర్థికవేత్తగా పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు సేవ అయిన ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించా భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



అయ్యప్పను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ముంపు బాధితుల సమస్యలు సత్వరమే పరిష్కరించండి

● వీడియో కాన్ఫరెన్సులో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

చింతూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల భూ సమస్యలు పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు ఏర్పాటుచేశారు. కాన్ఫరెన్సులో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కే ఆర్ కల్పశ్రీ, ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ కలెక్టర్ సరళవందనం, చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, వేదవల్లి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల బాధితులకు చెందిన భూ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా ఆదివాసీలకు భూమికి భూమి ఇచ్చే ప్రక్రియ సత్వరమే చేపట్టాలన్నారు. ఆమేరకు సాగుకు అనుకూలంగా ఉన్న భూములను గుర్తించాలన్నారు. దేవీపట్నం మం డలం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా శ్మశాన వాటికకు భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. అనంతరం ఆమేరకు అవసరమగు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనేతరులకు గోకవరంలో భూముల కేటాయింపు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

'ఇసుక ట్రాక్టర్లు నిలిపివేస్తే ఇల్లు ఎలా కట్టుకోవాలి'



ఇసుక రవాణా కాక గోతుల వద్దే ఆగిన గృహ నిర్మాణం

వై.రామవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో పీఎం జనమన్ పథకంలో పీవీటీజీలకు(కొండరెడ్లు) సుమారు 1200 ఇళ్ల మంజూరయ్యాయని ఇసుక ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసుకుంటుంటే వాటిని రెవెన్యూ అధికారులు సీజ్‌చేసి ఫైన్ కట్టిస్తున్నారని ఇలా అయితే గిరిజనులు ఇళ్లు ఎలా నిర్మించుకోవాలంటూ టీడీపీ మండలాధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గొడుగురాయి నుంచి గురమంద, చీడిపాకలు గ్రామాల్లో గృహనిర్మాణ లబ్దిదారులు ఇసుక తీసుకువస్తుంటే వాటిని అధికారులు సీజ్ చేశారన్నారు. ఒక పక్క ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు నీరు గారుస్తున్నారని ఆరోపించారు. గ్రామసచివాలయాల్లో సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ధ్రువీకరణ పత్రాలు పొందిన తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి పదిరోజులు కావొస్తున్న వాటికి అనుమతి ఇవ్వలేదన్నారు. గత రెండు నెలలుగా మండలంలో పలు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసి ఫైన్ కట్టించుకున్నారని దీంతో గిరిజన లబ్దిదారులకు ఇళ్లు కట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులకు డిపార్టుమెంట్ ద్వారా ఇళ్లు నిర్మించాలని ఆయన కోరారు.

ఉమ్మడివరం, అన్నవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

వీఆఆర్‌పురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని రేఖపల్లి గ్రామ పంచాయతీలోని అన్నవరం, ఉమ్మడివరం గ్రామాలలో శనివారం భూమి మీహక్కు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్న గిరిజన రైతులు 20 సంవత్సరాల క్రితం నుంచి సాగు చేసుకుంటున్న అసైన్మెంట్ పట్టాలు మంజూరు చేయటం గురించి, కొత్త రేషన్ కార్డులు, కొత్తపెన్షన్లు మంజూరు కోసం, అటవీ హక్కుల భూమి పట్టాలు, మృతిచెందిన పట్టాదారుల పేర్లు మార్పు నకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ సరస్వతి, రంపచోడవరం టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బీరక సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ రైతుల భూసమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ రెవెన్యూ సదస్సులు రైతులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, టీడీపీ మండల కార్యదర్శి బురక కన్నారావు, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, అటవీశాఖ, వైద్య సిబ్బంది ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జనవరి 8 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

దేవీపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండల వాలీబాల్ టోర్నమెంట్ నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా జనవరి 8 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని టోర్నమెంట్ ఆర్గనైజర్లు దూసరి హరిబాబు, యలగాడ నాగేశ్వరరావు, ఎస్.రవి, ఎస్.పండు, డి.శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని ఇందుకూరు గ్రా మంలో ముత్యాలమ్మతల్లి గుడివెనుక ఎంపీపీ స్కూల్ ఎదు రుగా ఉన్న ఆట స్థలంలో ఈ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి మొత్తం 20 జట్లు పాల్గొంటాయన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు మరిన్ని వివరాలకు 9493338945, 9493654420, 9492736226 నెంబర్లను సంప్రదించాలన్నారు.

స్వచ్ఛంద సంస్థలపై ఆరోపణలు తగదు

కూనవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవచేస్తూ ఆపదలో ఆదుకుంటున్న జేకే ట్రస్టుపై ఆరోపణలు చేయడం తగదని మాజీ ఎంపీపీ గిరిజన సంఘం నాయకులు, టీడీపీ మండల సెక్రటరీ పొడియం అప్పారావు అన్నారు. జమాల్‌ఖాన్ ట్రస్టు కుల, మతాలకు అతీతంగా గిరిజన, గిరిజనేతరులను ఆపదలో ఉన్న ప్రతిఒక్కరినీ ఆదుకుంటూ ప్రజలకు సహాయపడుతుందన్నారు. చనిపోయిన కుటుంబానికి అప్పటికప్పుడు తక్షణమే రూ.5వేలు చెల్లిస్తున్నారన్నారు. తాగునీరు లేని గ్రామాలకు చేతిపంపులు వేయిస్తున్నారని గోదావరి వరదల్లో కొట్టుకుపోయిన ఇళ్లకు ప్రతీ పేద కుటుంబానికి ఇంటి సామాగ్రి అందజేస్తున్నారన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ద్వారా పేద వర్గాలకు సహాయం అందదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, చెలకాని ఉమామహేశ్వరరావు, గడేశుల ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ తవ్వకాలను నిరోధించాలి

అడ్డతీగల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ త్వవకాలు సాగుతున్నాయని వాటిని నిలుపుదల చే యాలని స్థానికంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో శనివారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వివరాల ప్రకారం గొంటువానిపాలేం సర్వే నెంబరు207-1,207-6లో అటవీ భూమిలో జరుగు అక్రమ మైనింగ్ క్వారీ లీజులు 2008 నుంచి 2018తో గడువు ముగిసింది. 2018నుంచి 2024వరకు ఎటువంటి అనుమతులు లేకుండా క్వారీ నుంచి మెటల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెంబరు 207-1లో 23-06-2015న కె.వి.వి.సత్యనారాయణ అనే తహశీల్దార్ ఎటువంటి ప్రొసీడింగ్ లేకుండా పాత సబ్ డివిజన్ మార్చి రికార్డులను తారుమారు చేసి అక్రమాలకు పాల్పడ్డాడని ఫారెస్టు భూమి రికార్డులను మార్చారని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి రికార్డులను తారు మారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ సర్పంచ్ యేగులమ్మ, ఉప సర్పంచ్ ఆదారి నాగబాబు, జర్తా సత్యవర ప్రసాద్‌లు ఉన్నారు.

పుష్కర జలాలను మెట్టకు తరలించిన ఘనత టీడీపీదే

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



మాజీ మంత్రి యనమలను మర్యాదపూర్వకంగా కలిసిన అడబాల

తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర జలాలను మెట్ట ప్రాంతానికి తరలించిన ఘనత టీడీపీదేనని టీడీపీ సీనియర్ నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. పుష్కర ఎత్తిపోతల ఆయకట్టు ఛైర్మన్లుగా ఎన్నికైన అడబాల భాస్కరరావు, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అప్పలరాజుతో కలిసి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల భాస్కరరావును అభినందిస్తూ మా ట్లాడారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో మెట్ట ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో పుష్కర పుట్టిందని, గత పాలకుల నిర్లక్ష్యానికి అధోగతి పాలైన ఈ ప్రాజెక్టును ప్రగతిపథంలో నడిపించేందుకు కృషి చేయాలని తెలిపారు. యనమల వెంట స్థానిక నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

కోటనందూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీ కులగణన సోషల్ ఆడిట్ వేగవంతం చేస్తున్నామని మండల రెవెన్యూ అర్ఐ గీత తెలిపారు. శనివారం కేవో అగ్రహారంలో సోషల్‌ఆడిట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ కులగణనలో తప్పులుంటే సరిదిద్దుతున్నామన్నారు మండలంలో ఎస్సీలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వో రాజాదేవి తదితరులు పాల్గొన్నారు.



కెవోఅగ్రహారంలో ఎస్సీ కులగణన సర్వే చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ



కిశోర వికాసం కార్యక్రమంలో పాల్గొన్న పెద్దాపురం డీఎస్పీ

కిర్లంపూడి, డిసెంబరు 28(ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోషకాహారం, లింగ వివక్ష, ఆత్మరక్షణ తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జోసెఫ్, మక్కా చిన్నారావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఐ సతీష్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, క్రాంతి చారిటబుల్ ట్రస్టు బొడ్డేటి అప్పారావు, సూపర్‌వైజర్లు బూసమ్మ, కరీమున్నీసా, సునీత పాల్గొన్నారు.

'భూ సమస్యలను పరిష్కరిస్తాం'



ధర్మవరంలో అధికారులకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్థానికులు 8 భూ సంబంధిత సమస్యల దరఖాస్తులు అందజేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.సూర్యప్రభ స్థానిక దళితవాడనగర్‌ను సందర్శించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైన్‌లు, మంచినీటి పరిశుభ్రత వంటి పనులు నిర్వహించాలని పలువురు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల కృష్ణ, సెక్రటరీ బి.కామరాజు, స్థానిక పెద్దలు బొల్లు కొండబాబు, పుణ్యమంతుల రాజా, పుణ్యమంతుల రవి, హౌసింగ్ డీఈ సువర్ణరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: గ్రామాల్లో ఉన్న భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహశీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ సేవలను సమర్ధంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టాదారు పుస్తకంలోని పేర్లు తప్పుల నమోదులు, వాస్తవ నమోదుకన్నా తక్కువ విస్తీర్ణం నమోదులు, భూసర్వే తదితర సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించారు. టీడీపీ నాయకులు సుంకర సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీనగరంలో రెవెన్యూ సదస్సు

తొండంగి: ఏవీనగరంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మురార్జీ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి రైతుల నుంచి 27 ఫిర్యాదులు అందాయి. గ్రామ టీడీపీ నేతలు యనమల నాగేశ్వర్రావు, ఆర్ఐ రాజేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థను దెబ్బతీశారు

ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లపాలనలో వైసీపీ ప్రభుత్వం అనాలోచిన నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థను దెబ్బతీశారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విమర్శించారు. 2019 నాటికి రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండగా 2024నాటికి విద్యుత్ రంగాన్ని పూర్తిగా జగన్ నాశనం చేశారన్నారు. ఈ నాడు అసత్య ఆరోపణలతో ధర్నాలు చేసినంతమాత్రాన ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని నమ్ముతారనుకోవడం భ్రమేనన్నారు. నేడు రాష్ట్రంలో 20వేల మెగా వాట్లవిద్యుత్ సామర్థ్యంలో గల విద్యుత్‌ప్లాంట్‌లను చంద్రబాబు హయాంలో నిర్మించినవేనని అందువల్లే రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వగలుగుతున్నామన్నారు. సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు కొమ్మల కన్నబాబు, యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.

రూ.22 కోట్లతో రోడ్డు నిర్మాణం

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.22కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. శనివారం ఏజెన్సీ ముఖద్వారమైన రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు సుమారు 10.7 కిలోమీటర్ల మేర రహదారి పునర్‌నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యప్రభ ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీరు నయీముల్లా కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌డీబీ నిధులతో నెలరోజుల్లోపల 3కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు, 7.7 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని సుమారు ఆరు నెలలలోపు రహదారితోపాటు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య టీడీపీ నాయకులు బసా ప్రసాద్, జిగటాపు సూరిబాబు, నూకతాటి ఈశ్వరుడు, కనకారావు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబుకు సత్కారం

జగ్గంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబును శనివారం మెయిన్ రోడ్డులో గల న్యూ బాలాజీ జ్యూయలర్స్ షాపు వద్ద ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సోషల్ మీడియా ఛైర్మన్, ర్యాలీ ఆర్యవైశ్యసేవా సంఘం అధ్యక్షుడు మానేపల్లి శ్రీనివాస్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కొండబాబును ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించి ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం జాయింట్ సెక్రటరీ మానేపల్లి వీర్రాజు గుప్తా, మానేపల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్త కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం

కళాకారులను ఆదుకోవాలి

● కళాకారులు ఎమ్మెల్యేకు వినతి

ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కళాకారులను ఆదుకోవాలని కోరుతూ జిల్లాభజన మండలి కళాకారుల బృందం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కోరారు. శనివావారం సాయంత్రం జిల్లా భజన మండలి కన్వీనర్లు సానా నూకరాజునాయుడు, స్వామి నిర్భయానంద బృందం ప్రత్తిపాడులోని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని నాటకరంగ కళాకారులతోపాటు భజన కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభు త్వం చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ కళాకారులకు రూ.10 వేలు నెలవారీ పింఛన్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లిరాజా, జాబు సూర్యనారాయణ పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల క్యాలెండర్ ఆవిష్కరణ

తునిరూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు 2025 వార్షిక క్యాలెండర్‌ను శ్రీప్రకాష్ విద్యాసంస్థలనందు హోం మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ రతన్ టాటా సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, జాబ్ జిల్లా మేనేజర్ ఎ.కల్యాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ గోవిందరావులతో పాటు గా శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ అతిథులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు.



శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా అయ్యప్ప

ఏలేశ్వరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పైల అయ్యప్పను నియమిస్తూ శనివారం బీజేపీ పార్టీ ఉత్తర్వులు జారీచేసింది. అయ్యప్పను బీజేపీ నాయకులు పైలా సుభాస్ చంద్రబోస్ నివాసంలో శాలువాకప్పి, పూలమాలలువేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సింగిలి దేవి, వెంకట్రావు, సురేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

యువకులకు క్రీడాపోటీలు

జగ్గంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ఎస్ఐలు రఘునందన రావు, శివనాగబాబు, సతీష్ ఆధ్వర్యంలో మండలాల్లో వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ పోటీలు, మహిళలకు బాలబాలికలకు ముగ్గుల పోటీలు మ్యూజికల్స్ ఛైర్స్ లెమన్ స్పూన్స్ వంటి గేమ్స్ నిర్వహిస్తున్నట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. జగ్గంపేటలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి పోలీసులను సంప్రదించాలన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ పాస్ట్ అధ్యక్షుడు పంతం సూరిబాబు నివాస గృహంవద్ద విశాఖ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఎల్. మహేంద్రనాథ్, జేఎన్టీయూకే పూర్వ విద్యార్థుల సహకారంతో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, కార్యదర్శి రెడ్డి నాయుడు, లయన్స్ పంతం కృష్ణ, పిల్లా పద్మరాజు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొన్న పళ్లంరాజు



మన్మోహన్‌సింగ్ చితికి నమస్కరిస్తున్న మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజు

ప్రత్తి పాడు, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు డిల్లీలో శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో కాకినాడ జిల్లాకు చెందిన మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ చితికి పళ్లంరాజు నమస్కరించి నివాళులర్పించారు. అనంతరం మన్మోహన్ సింగ్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ సిబ్బంది నిరసన

కోటనందూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం పరిషత్ అభివృద్ధి అధికారి జవహర్‌బాబు దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోటనందూరు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శనివారం ఎంపీడీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఎంపీడీవోకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఏవో చిన్నారెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో న్యూఇయర్ ఏర్పాట్లు

ప్రత్తిపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంవద్ద కొత్త సంవత్సర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు న్యూఇయర్ సందర్భంగా జనవరి 1న నియోజకవర్గం వ్యాప్తంగా 20వేల మంది తరలివచ్చే అవకాశం ఉండటంతో స్థానిక హై స్కూల్ సమీపంలోని టీడీపీ కార్యాలయ పరిసరాల్లో షామియానాల ఏర్పాటు పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం ఎస్ఐ లక్ష్మీకాంత్ న్యూఇయర్ వేడుకలు జరిగే ప్రదేశాలు, కార్ పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించారు.

ఇసుక బకాసురులు..



ఎటపాకలో గోదావరి నదిలో ఇసుక తవ్వుతున్న దృశ్యం

● ఆంధ్రాలో తవ్వకం...తెలంగాణలో అమ్మకం ● ఎటపాక, చెన్నంపేట గోదావరినదిలో యథేచ్ఛగా తవ్వకాలు

● ఎటపాకలో పలుచోట్ల రాత్రి వేళ నిల్వలు ● చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎటపాక, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఎటపాక మండలంలో ఇటీవల యథేచ్ఛగా ఇసుక దందా సాగుతోంది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతోపాటు పక్కనే అనుకుని(తెలంగాణ) భద్రాచలం ఉండడంతో ఇసుక అక్రమా ర్కులకు వరంగా మారింది. ఎటపాకలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతంవైపు కన్నేశారు. రాత్రి వేళల్లో గోదావరి నదిలో మకాంవేస్తూ ఇసుక దందాను చక్కబెడుతున్నారు. అందిన కాడికి దండుకుంటు న్నారు.. యథేచ్ఛగా ఆంధ్రాలోని ఇసుక తవ్వ కాలు చేస్తూ.... తెలంగాణలో విక్రయిస్తూ లక్షలు గడిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తూ ఉండడంతో వారి దందాకు అడ్డూఅదుపూ లేకుండాపోతుంది. ఇసుక అక్రమ రవాణాను నిలువరించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడంలేదు. ఎటపాక మండలంలోని ఎటపాక, చెన్నంపేట గోదావరినదీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమార్కులు రాత్రివేళల్లో ఇసుక దందా నడుపుతున్నారు. నదీ గర్భంలో యంత్రాలతో ట్రాక్టర్లల్లో నింపి, అక్కడి నుంచి ట్రాక్టర్లలో ఎటపాకలో నాలుగైదు ప్రదే శాల్లో ఇసుకనిల్వలు చేస్తున్నారు. ఎటపాకలో జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంతోపాటు, ఎటపాకలోని ఇటుక బట్టీల చాటున నిల్వలు ఉంచుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో ఆ ఇసుక నిల్వలను ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడ్ చేసుకుని, భద్రాచలం పట్టణంతోపాటు, సారపాక, మోరంపల్లి బంజరకు తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తుండగా, టిప్పర్ లోడ్ రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ దందా అంతా రాత్రి సమయంలోనే చక్కబెడుతున్నారు. తెల్లవారే సమయానికి దందా అంతా ముగిసిపోతుంది. భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తితోపాటు ఎట పాకకు చెందిన పలువురు సిండికేటుగా ఏర్పడి, దందాను తాపీగా నడిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో వ్యక్తి ఇసుక రవాణా చేసే బాధ్యతను తీసుకుంటారు.. ఇలా రాత్రి సమయాల్లో గుట్టుగా ఆంధ్రా నుంచి భద్రాచలంనకు రవాణా చేస్తున్నారు. పదులసంఖ్యలో ట్రాక్టర్ల, టిప్పర్లలో ఇసుక రవాణా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం కూతవేటు దూరంలోనే ఇసుక దందా సాగుతున్నా, అధికారులు ఆవైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. ఎటపాక, చెన్నంపేట గోదావరినదీలోకి వెళ్లేందుకు రెండుచోట్ల అక్రమార్కులు తాత్కాలిక ర్యాంపులు కూడా ఏర్పాటు చేశారంటే దందా ఏ స్థాయిలో నడు స్తుందో అర్థం చేసుకోవచ్చు.



ట్రాక్టర్లలో భద్రాచలంనకు తరలిస్తున్న ఆంధ్రా ఇసుక